ఘనపూర్ గ్రామంలో ఘనంగా గ్రామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ఘనపూర్, బతుకమ్మ ఘనపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి డిచిపల్లి ఉప నిరీక్షకుడు ఆరిఫ్, మండల రెవెన్యూ అధికారి మునీర్, వైద్యుడు దీపక్ రాథోడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రీమి యర్ లీగ్‌ను గత 15 సంవత్సరా లుగా నిరంతరంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులు, యువకులు సెలవుల్లో స్వగ్రామానికి వచ్చినప్పుడు వారందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి పరస్పర పరిచయాలు పెంపొందించడంతో పాటు ఐక్యతను బలోపేతం చేయడమే ఈ పోటీల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రస్తుత కాలంలో యువత ఎక్కువ సమయం దూరవాణి పరికరాలకే పరిమితమవుతున్న నేపథ్యంలో, వారిని ఆటల వైపు మళ్లించి శారీరకంగా, మానసికంగా ఉత్తేజపరిచేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. సాయినాథ్, దాసు, కృష్ణ, ఓం ప్రసాద్, సాగర్, రాజు, గంగమోహన్, సుమన్, శ్రీను, మహేష్ తదితర యువకులు తీసుకున్న ఈ వినూత్న కార్యక్రమం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ పోటీల నిర్వహణకు గ్రామ ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, స్థిరాస్తి వ్యాపారులు, యువసేన సభ్యులు, విదేశాల్లో నివసిస్తున్న గ్రామస్తులు ఆర్థిక సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల ద్వారా యువతలో పరస్పర సహకారం పెరిగి, ఉన్నత విద్యాభ్యాసం మరియు ఉద్యోగ అవకాశాల విషయంలో ఒకరికొకరు తోడ్పాటును అందించుకుంటున్నారని చెప్పారు. సుమారు 30 రోజుల పాటు వంద మందికి పైగా యువకులు, విద్యార్థులను ఆటలలో నిమగ్నం చేసి దూరవాణి పరికరాలకు దూరంగా ఉంచేందుకు

కృషి చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. అలాగే ఇటువంటి క్రీడా కార్యక్రమాలు యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్య అనే ఆయుధంతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని యువతకు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సన్మానించడంతో పాటు దేశ రక్షణ దళంలో సేవలందిస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన రవాణా సంస్థ ఉద్యోగి, కార్యక్రమ నిర్వహణలో విశేష కృషి చేసిన వాసరి సాయినాథ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మలయ్య, కపిల్, రమణ, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలానికి ముందస్తు సన్నద్ధతపై ప్రజలకు అవగాహన

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగరంలోని 43వ డివిజన్‌లో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులకు అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కాలనీల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి కీ ప్రజాప్రతినిధులు మరియు మున్సిపల్ అధికారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్ ఎర్రం గంగాధర్, కో-ఆప్షన్ సభ్యు రాలు

బొబ్బిలి మాధురి, సామాజిక కార్యకర్త బొబ్బిలి మురళి, మున్సిపల్ ఏఈ భువనేశ్వర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

రివర్స్ సైకాలజీ అంటే ఏమిటి.. దీన్ని ఎప్పుడు, ఎలా ఉపయోగించాలి..?

రివర్స్ సైకాలజీ అనే పదం వినగానే చాలా మందికి మానసిక ఆటలు లేదా ఇతరులను ప్రభావితం చేసే వ్యూహాలు గుర్తుకు వస్తాయి. అయితే దీని వెనుక ఉన్న అసలు సూత్రం మనుషులు నియంత్రణ, స్వేచ్ఛ, ఆసక్తి వంటి అంశాలకు ఎలా స్పందిస్తారనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఎవరైనా తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని భావిస్తే సహజంగానే వ్యతిరేకంగా స్పందించే అవకాశం ఉంటుంది. కానీ నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను ఇచ్చినప్పుడు లేదా స్వల్పంగా సవాలు చేసినప్పుడు, చాలామంది అనుకున్న దిశలోనే అడుగులు వేస్తారు. ఈ పద్ధతులు తల్లిదండ్రుల పెంపకం, మార్కెటింగ్, వ్యక్తిగత సంబంధాలు, అలాగే స్వీయ ప్రేరణలో కూడా కనిపిస్తాయి. అయితే వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే సానుకూల ఫలితాలు ఇస్తాయి. నిర్లక్ష్యంగా ఉపయోగిస్తే నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది.

బలవంతంగా ప్రోత్సహించాల్సి వస్తే..

ఏదైనా విషయాన్ని బలవంతంగా ప్రోత్సహించకుండా, స్వల్పంగా తక్కువ చేసి చెప్పడం కూడా రివర్స్ సైకాలజీలో ఒక పద్ధతి. ఉదాహరణకు ఈ రెస్టారెంట్‌కి వెళ్లొచ్చు, కానీ అది మీ అభిరుచికి సరిపోకపోవచ్చు అని చెప్పడం. ఇలా చెప్పడం వల్ల ఎదుటివారికి తమ స్వేచ్ఛను గౌరవిస్తున్నారనే భావన కలుగుతుంది. అదే సమయంలో ఎందుకు నచ్చదు? అనే ఆసక్తి కూడా పెరుగుతుంది. అయితే కొన్నిసార్లు వారు నిజంగానే ఆసక్తి చూపకుండా వదిలేస్తారు. ఈ పజిల్ మీకు సరిపోతుందో లేదో తెలియదు, ఇది చాలా కష్టమైనది వంటి వ్యాఖ్యలు వ్యక్తి గర్వాన్ని, సామర్థ్యాన్ని సవాలు చేస్తాయి. చాలామంది తమను తక్కువ అంచనా వేశారని భావించి ఆ పనిని చేసి చూపించాలని ప్రయత్నిస్తారు. అయితే ఈ వ్యాఖ్య వ్యంగ్యంగా లేదా అవమానకరంగా అనిపిస్తే ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

ప్రత్యేకత చెప్పాలనుకుంటే..

ఫోటోగ్రఫీపై నిజమైన ఆసక్తి ఉన్నవారికే ఈ వర్క్‌షాప్ నచ్చుతుంది వంటి వ్యాఖ్యలు ప్రత్యేకత భావనను కలిగిస్తాయి. పరిమితంగా లేదా ప్రత్యేకంగా కనిపించే విషయాలకు మనుషులు ఎక్కువ విలువ ఇస్తారు. మార్కెటింగ్‌లో ఈ పద్ధతిని విస్తృతంగా ఉపయోగిస్తారు. కానీ వాస్తవానికి లేని కొరతను సృష్టిస్తే, అది బయటపడినప్పుడు నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ వారాంతంలో నాకు సహాయం చేయాల్సిన అవసరం లేదు.. అని చెప్పడం రివర్స్ సైకాలజీకి క్లాసిక్ ఉదాహరణ. పైకి చూస్తే బాధ్యత నుంచి విముక్తి కల్పించినట్టే ఉంటుంది. కానీ లోపల మాత్రం ఎదుటివారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆశ ఉంటుంది. అయితే వారు ఆ మాటను అక్షరాలా తీసుకుని నిజంగానే సహాయం చేయకపోవచ్చు.

సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఉంటే..

ఈ ఆలోచనకు పెద్దగా స్పందన రాకపోవచ్చు అని చెప్పడం ద్వారా కొందరిలో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలనే కోరిక పెరుగుతుంది. ఇది అదనపు కృషికి ప్రేరణ ఇస్తుంది. కానీ ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నవారిలో మాత్రం నిరుత్సాహాన్ని కలిగించే అవకాశం ఉంటుంది. ఈ రోజు జిమ్‌కు వెళ్లకపోయినా ఫరవాలేదు వంటి మాటలు ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో వ్యక్తి స్వయంగా సరైన నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వస్తాడు. స్వతంత్రంగా ఆలోచించే వారిపై ఈ పద్ధతి బాగా పనిచేస్తుంది. అయితే ఇప్పటికే ప్రేరణ లేని వ్యక్తికి ఇది వదిలేయడానికి మరో కారణంగా మారుతుంది. ఏం చేసినా నేను కొన్న సర్‌ప్రైజ్‌ను చూడకం అనే వ్యాఖ్య ఆసక్తిని రేకెత్తిస్తుంది. మనిషి మనసు నిషేధించిన విషయాల పట్ల ఎక్కువ ఆకర్షితమవుతుంది. సరదా సందర్భాల్లో ఇది ప్రభావవంతంగా ఉంటుంది. కానీ తరచూ ఉపయోగిస్తే ఈ పద్ధతి తన ప్రభావాన్ని కోల్పోయి, కృత్రిమంగా లేదా మోసపూరితంగా అనిపిస్తుంది. రివర్స్ సైకాలజీ అనేది ఇతరులను నియంత్రించే సాధనం కంటే, మానవ మనస్తత్వం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకునే ఒక ఆసక్తికరమైన విధానం. అయితే దీని విజయవంతమైన ఉపయోగం నిజాయితీ, పరస్పర గౌరవం, సరైన సందర్భంపై ఆధారపడి ఉంటుంది.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

లింగంపేట, బతుకమ్మ :రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేద యువకుడికి హైకోర్టు న్యాయవాది ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట గ్రామానికి చెందిన లంబడి శ్రీనివాస్ (చిన్న) గత నెలలో రాత్రి సమయంలో గోపాల్‌పేట నుంచి ద్వి చక్రవాహనంపై వస్తున్నారు. మార్గమధ్యలో రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పలపై కప్పిన నల్లటి టార్పాలిన్ కవరు చీకటిలో కనిపించక పోవడంతో వాహనం అదుపు తప్పి దానిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న విషయం తెలుసుకున్న లింగంపేట మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది మోహిన్ ఖాద్రీ వాట్సాప్ సందేశం ద్వారా వెంటనే స్పందించారు. ఆయన సూచనల మేరకు వారి కుటుంబ సభ్యుడు కాసిఫ్ మహ్మద్ ఖాద్రీ స్థానిక యువకుడు సునీల్ ద్వారా శ్రీనివాస్ కుటుంబానికి రూ. 25,000 నగదును అందజేశారు. బాధితుడు పూర్తిగా కోలుకునే వరకు ఎల్లవేళలా అండగా ఉంటానని న్యాయవాది భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో ముందుంటున్న మోహిన్ ఖాద్రీని పలువురు గ్రామస్థులు, యువకులు అభినందించారు.

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా శంకర్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి గా శంకర్ బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న శంకర్ కు ఇటీవల నిజామాబాద్ కు బదిలీ అయింది. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఈవో శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా తరఫున ఆహ్వానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీఈఓ సాయి గౌడ్, ఎంపీడీవో అసోసియేషన్ తరపున శ్రీనివాస్ రావు జిల్లా పరిషత్ పర్యవేక్షకులు, సిబ్బంది పుష్ప గుజ్జాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గడ్డం భాస్కర్, సెక్రటరీ ప్రదీప్ కుమార్, ట్రెజరర్ విట్టల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిద్దు పటేల్, కార్యనిర్వాహక సభ్యులు అందరు పాల్గొన్నారు.

బిఆర్ఐసిఎస్ దేశాలలో బంగారం ధరల ప్రభావంపై టేయూలో పరిశోధన

డిచ్ పల్లి, బతుకమ్మ :తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి ఎం.నర్సింహులు "డేటా సైన్స్ పద్ధతుల ద్వారా బిఆర్ఐసిఎస్ దేశాలలో బంగారం ధరల ప్రభావం - స్టాక్ మార్కెట్ యుఎస్ డాలర్ పై అధ్యయనం" అనే అంశంపై స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పరిశోదన పూర్తిచేశారు. ప్రొఫెసర్ ఎస్.ఏ.జ్యోతి రాణి, ఉస్మానియా యూనివర్సిటీ, బాహ్య పరిశీలకురాలిగా వ్యవహరించారు. ఈ పరిశోధన ద్వారా బంగారం ధరలు పెరిగినప్పుడు స్టాక్ మార్కెట్లు ఎలా స్పందిస్తాయో శాస్త్రీయంగా విశ్లేషించడం జరుగుతుంది. దీనివల్ల పెట్టుబడిదారులు తమ పోర్ట్ ఫోలియోలో బంగారం, షేర్ల మధ్య సరైన సమతుల్యతను ఏర్పరచుకుని రిస్క్ ను తగ్గించే వ్యూహాలను రూపొందించుకోవడానికి అవకాశం లభిస్తుంది. అదేవిధంగా యుఎస్ డాలర్ బలపడినప్పుడు లేదా బలహీనపడినప్పుడు బిఆర్ఐసిఎస్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై పడే ప్రభావాన్ని, కరెన్సీ మార్పిడి రేట్లు, బంగారం ధరల మధ్య గల సంబంధాన్ని డేటా సైన్స్ పద్ధతులతో అధ్యయనం చేస్తున్నారు. ఈ పరిశోధన ఫలితాలు విధాన నిర్ణేతలకు, ఆర్థిక నిపుణులకు, పెట్టుబడిదారులకు నిర్ణయాలు తీసుకోవడంలో మార్గదర్శకంగా నిలుస్తాయని ఎం.నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్, రిజిస్ట్రార్ లు విద్యార్థిని అభినందించారు.